ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జయశంకర్ భూపాలపల్లి

ఆదివారం 22 డిసెంబరు 2024

సండే స్పెషల్ SUNDAY SPECIAL



పల్లె ముంగిట ఆన్‌లైన్ సరుకులు



గ్రామాలకు విస్తరించిన ఈ-కామర్స్ వ్యాపారం

- సమయం ఆదా, ఇంటివద్దకే కావలసిన వస్తువు
- ఉమ్మడి జిల్లాలో 30 రకాల ఆన్‌లైన్ సంస్థలు
- 20కిపైగా వాటి అనుబంధ ఏజెన్సీలు
- పట్టణాలు, మండల కేంద్రాల్లో సైతం కార్యాలయాలు
- రోజుకు 5వేల వరకు ఆర్డర్లు
- సగటున రూ.40 నుంచి 45 లక్షల వ్యాపారం
- 5వేల మందికిపైగా యువతకు ఉపాధి

7

పల్లెటూర్లలో ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న కొద్దీ.. ఈ-కామర్స్ వేగంగా విస్తరిస్తోంది. ఒకప్పుడు పట్టణాలకే పరిమితమైన ఆన్‌లైన్ షాపింగ్.. ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలలోనూ సర్వసాధారణమవుతోంది. పట్టణాల్లో లభించే అన్నిరకాల ఉత్పత్తులు ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లో కూడా కొనుగోలు చేయడానికి అందుబాటులో ఉన్నాయి. దుకాణాల చుట్టూ తిరగకుండా ఇంటి నుంచి కావలసిన వస్తువులను ఆర్డర్ చేస్తున్నారు. ఇందుకోసం చాలా వెబ్‌సైట్లు, యాప్‌లు ఆకర్షణీయమైన ఆఫర్లు, డిస్కౌంట్లను అందిస్తున్నాయి. క్యాష్ ఆన్ డెలివరీ, డెబిట్, క్రెడిట్ కార్డులు, డిజిటల్ వాలెట్స్ వంటి అనేక చెల్లింపులకు ఆప్షన్లు ఉన్నాయి, ఈ-కామర్స్ ద్వారా ఇంటి నుంచే ఆర్డర్ నమోదు చేయగానే తమకు నచ్చిన వస్తువు వచ్చి చేరుతోంది. దీని ద్వారా కొనుగోలుదారులకు సమయం ఆదా అవుతోంది. పైగా తక్కువ ధరలకు వస్తువు దొరుకుతోంది. తాము కొనుగోలు చేయదలుచుకున్న వస్తువు నాణ్యత, స్థిరమైన ధర, ఆ వస్తువును ఎంతమంది ఇష్టపడుతున్నారు? వస్తువు చిత్రం తదితర సమాచారమంతా ముందే తెలుసుకునే అవకాశం ఉంటుంది. నచ్చకపోయినా, నాణ్యత లేకపోయినా తిరిగి పంపే అవకాశం కూడా ఇందులో ఉంటోంది. అందుకే జనం ఈ-కామర్స్ వైపు మొగ్గు చూపుతున్నారు.

- హనుమకొండ, ఆంధ్రజ్యోతి

విద్యుత్ తీగలు తగిలి ఒకరి మృతి

క్రైం కార్నర్

తాను అమర్చిన ఉచ్చుకు తానే బలి




సంఘటన స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, మృతుడు గణేష్ (ఫైల్)

చిట్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : వన్యప్రాణాలను వేటాడేందుకు ఓవ్యక్తి అమర్చిన విద్యుత్ ఉచ్చుకు అతడే ప్రాణాలు విడిచిన సంఘటన భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని వెంచరామి శివారులో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. టేకుమట్ల మండలం బూర్నపల్లి గ్రామానికి చెందిన గణేష్ (24) వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలతో ఉచ్చులు ఏర్పాటు చేసేవాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన గణేష్ వెంచరామి శివారు అటవీ ప్రాంతంలోని జామాయిల్ తోటలో విద్యుత్ తీగలు ఏర్పాటు చేశాడు. వన్యప్రాణుల వేట కోసం ఆ ప్రదేశంలోనే రాత్రంతా వేచి చూశాడు. శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు ఆ విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి చేరుకున్న సీఐ మల్లేష్, ఎస్సై శ్రావణ్‌కుమార్ ప్రమాద తీరును పరిశీలించారు. గణేష్ మృతదేహానికి కొంతదూరంలో విద్యుత్ ఉచ్చులకు అడవిపంది సైతం మృతిచెంది ఉన్నదని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య అపర్ణతోపాటు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ తెలిపారు.

మోరంచవాగులో పడి రైతు మృతి



బాపురావు (ఫైల్)

గణపురం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు వాగులో పడి ఓ రైతు మృతి చెందిన సంఘటన భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బస్వరాజుపల్లిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం... బస్వరాజుపల్లికి చెందిన రైతు దామరపెల్లి బాపురావు (60) మోరంచవాగు శివారులోని తన పొలం వద్దకు శుక్రవారం సాయంత్రం వెళ్లాడు. మార్గమధ్యలోని మోరంచ వాగును దాటుతున్న క్రమంలో ప్రమాదవశాత్తులో అందులో పడి మృతి చెందాడు. రాత్రి అయినా బాపురావు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అతడి కోసం వెతికారు. శనివారం తెల్లవారుజామున అతడి మృతదేహం మోరంచవాగులో తేలయాడుతూ కనిపించింది. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. భార్య వినోద గతంలోనే అనారోగ్యంతో మృతి చెందింది.

జ్యుడీషియల్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



జిల్లా జడ్జి నారాయణబాబుతో జ్యుడీషియల్ ఉద్యోగుల నూతన కార్యవర్గం

8లో

అప్‌గ్రేడ్‌పై ఆశలు

- జీజీహెచ్‌కు త్వరలోనే మహర్దశ
- ఆస్పత్రి అభివృద్ధిపై దృష్టిసారించిన వైద్య శాఖ
- మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు మంత్రి దామోదర సుముఖం
- త్వరలోనే 200 బెడ్ల ఆస్పత్రిగా పురోగతి
- రూ. 4 కోట్లతో అందుబాటులోకి రానున్న సిటీ స్కాన్



ఆస్పత్రిలో వేచి ఉన్న ఔట్‌పేషెంట్లు

భూపాలపల్లిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)కి మహర్దశ పట్టనుంది. దినదినాభివృద్ధి చెందుతున్న ఈ దవాఖాన మరో మైలురాయి దాటనుంది. ఇప్పటికే 12 రకాల సేవలు ఇక్కడ అందిస్తుండగా మరిన్ని అందుబాటులోకి రానున్నాయి. దీంతో భూపాలపల్లి జిల్లా ప్రజలకే కాకుండా పెద్దపల్లి, మహారాష్ట్ర ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందనుంది. ఇటీవల జిల్లాలో పర్యటించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదార రాజనర్సింహ దీనిపై ఇప్పటికే సంకేతాలు ఇవ్వగా ఈ ఆస్పత్రి అభివృద్ధి త్వరలోనే కార్యరూపం దాల్చనుంది. దీని నిర్వహణపై మంత్రి దామోదర సంతృప్తి వ్యక్తం చేస్తూ పలు హామీలు ఇచ్చారు.

దృష్టిసారించిన మంత్రి దామోదర

జీజీహెచ్‌లో అందుతున్న సేవల పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వరాల జల్లు కురిపించారు. ఇటీవల జిల్లా పర్యటనలో భాగంగా ఆస్పత్రిలో పలు శంకుస్థాపనలు చేశారు. ఆస్పత్రికి మరిన్ని సౌకర్యాలు అవసరం ఉందని ఆయన దృష్టికి రాగా వెంటనే ఓకే చెప్పేశారు. ఆస్పత్రిలో రూ.4 కోట్లతో 32స్లైస్ సామర్థ్యం కలిగిన సిటీ స్కానింగ్ మిషన్‌ను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈసీఎల్ కంపెనీ సీఎస్ఆర్ నిధుల నుంచి సిటీ స్కానింగ్ మిషన్‌ను జీజీహెచ్‌కు ఇచ్చేందుకు సుముఖత వ్యక్తం చేశారు. జనవరి నెలఖారులో ఆస్పత్రిలో సిటీ స్కానింగ్ సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. దీంతో పాటు రూ.80లక్షలు విలువ చేసే నాలుగు వెంటిలేటర్స్‌ను కూడా మంత్రి మంజూరు చేశారు.

త్వరలోనే అప్‌గ్రేడ్

జీజీహెచ్ త్వరలోనే అప్‌గ్రేడ్ కానుంది. 140 పడకల ఆస్పత్రిగా ఉన్న 200 పడకల స్థాయికి చేరనుంది. ఇప్పటికే భూపాల పల్లి, పెద్దపల్లి జిల్లాల ప్రజలకు, మహారాష్ట్ర వాసులకు మెరుగైన సేవలు అందిస్తున్న ఈ వైద్యశాలలో మరిన్ని అందుబాటులోకి వస్తే కార్పొరేట్ స్థాయి వైద్యం అందే అవకాశం ఉంటుంది.

ఇప్పటికే 12 రకాల వైద్యసేవలు

ప్రస్తుతం జీజీహెచ్‌లో 12 రకాల వైద్యసేవలు ప్రజలకు అందుతున్నాయి. అనస్థీషియా, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజీ, ఈఎన్‌టీ, డెంటల్, పీడియాట్రిషన్, రేడియాలజీ, సైకాలజీ, ఫిజియోథెరపీ, కంటి వైద్యం అందుబాటులో ఉన్నాయి. వీటిలో జనరల్ మెడిసిన్, సర్జరీ, అనస్థీషియా, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిషన్ వంటి సేవలు 24 గంటలు ప్రజలకు అందుతున్నాయి. ఆస్పత్రి మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉండటంతో సీనియారిటీ కలిగిన వైద్యులు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ప్రొఫెసర్లు అయిన మంచి పేరు గల డాక్టర్లు నవీన్ కుమార్, నాగార్జునరెడ్డి, రాజేంద్రప్రసాద్, రఘు, సురేందర్, కవిత,

» మిగతా 8వ పేజీలో...

ప్రాధాన్య రంగాలకు అధిక రుణాలు ఇవ్వాలి

బ్యాంకర్లతో కలెక్టర్ రాహుల్‌శర్మ



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్య రంగాలకు అధిక రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కలెక్టర్ రాహుల్‌శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు ఎలాంటి జాప్యం లేకుండా అత్యధికంగా పంట రుణాలు అందించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం పంట రుణ లక్ష్యం రూ.1,344.57 కోట్లు కాగా ఇప్పటి వరకు రూ.447.33 కోట్ల రుణ లక్ష్యం సాధించామన్నారు. రుణ లక్ష్య సాధనలో మరింత ప్రగతి సాధించేందుకు బ్యాంకర్లు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. బ్యాంకుల్లో పెండింగ్ ఉన్న యూనిట్లను తరుచూ సంప్రదించి రుణ ప్రక్రియపూర్తి చేయాలన్నారు. రికవరీ శాతాన్ని పెంచేందుకు అధికారులు గ్రామస్థాయిలో లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. రైతు వేదికల్లో ప్రతినెల సమావేశాలు ఏర్పాటుచేసి రుణప్రగతి పెంచేందుకు కృషిచేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పాడి పరిశ్రమను ప్రోత్సహించేందుకు పెద్ద మొత్తంలో రుణాలు ఇవ్వాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో వీధి వ్యాపారులకు సకాలంలో రుణాలు ఇవ్వాలన్నారు. మహిళాశక్తి ప్రోగ్రాం కింద స్వయం సహాయక సంఘాలకు మోడల్ సీఎస్‌సీ కేంద్రాలను ప్రతి మండలానికి ఒకటి చొప్పున కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఐ ఎల్‌డీఎం అలీబాబా, డీఆర్‌డీఏ నరేష్, ఎల్‌డీఎం తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

వివాహేతర సంబంధమే హత్యకు కారణం

పోలీసుల ఎదుట లొంగిపోయిన నిందితుడు



రమేష్ అరెస్టును చూపిస్తున్న సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్

కాటారం, డిసెంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలలోని అంకుసాపూర్ ఎర్రగుంట అటవీ ప్రాంతంలో చోటు చేసుకున్న మహిళాహత్య కేసులో నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. దీంతో అతడిని రిమాండ్‌కు తరలించారు. ఆ మహిళతో అతడు పెట్టుకున్న వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసిందని గుర్తించి కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. దీంతో హడలిపోయిన నిందితుడు పోలీసుల ఎదుట లొంగిపోయాడు. కాటారం సర్కిల్ కార్యాలయంలో సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్ శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వపరాలను వెల్లడిస్తూ నిందితుడు ఇనుగాల రమేష్ అరెస్టును చూపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం...

హత్యకు గురైన శైలజ భర్తను విడిచిపెట్టి భూపాలపల్లి మండలం కమలాపూర్‌లో తల్లితో కలిసి ఉంటోంది. అంకుసాపూర్‌లోని తన అక్కచెల్లెళ్లను చూడటానికి తరుచుగా వచ్చేది. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఇనుగాల రమేష్‌తో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారి తీసింది. రమేష్‌కు భార్య ఉండగానే పదేళ్లుగా శైలజతో సంబంధం కొనసాగుతోంది. ఈ క్రమంలో శైలజ వద్ద కొన్ని డబ్బులు కూడా అతడు తీసుకున్నాడు. కొన్ని నెలలుగా రమేష్‌ను శైలజ దూరం పెట్టడంతో పాటు తనకు ఇవ్వాల్సిన డబ్బుల గురించి ఇబ్బంది పెట్టింది. దీంతో గొడవలు జరగ్గా రమేష్‌పై భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అప్పటి నుంచి డబ్బుల కోసం శైలజ తరచూ ఇబ్బంది పెడుతుండగా ఎలాగైనా ఆమెను వదిలించుకోవాలని రమేష్ ప్లాన్ చేశాడు. మాయమాటలు చెప్పి అంకుసాపూర్ అటవీప్రాంతం వద్దకు రావాలని కోరడంతో శైలజ అందుకు ఒప్పుకుంది. మేడిపల్లి వద్ద బస్సు దిగి రమేష్‌తో కలిసి ఇద్దరు వెళ్లారు. నడుచుకుంటూ అటవీప్రాంతంలోకి వెళ్లగానే మద్యం మత్తులో ఉన్న రమేష్ ఒక్కసారిగా శైలజను కొట్టాడు. దీంతో ఆమె కిందపడగానే ఛాతీపై కూర్చొని ముక్కుమూసి, గొంతు నులిమి హత్య చేశాడు. శవాన్ని కొంత దూరం తీసుకెళ్లి కందకంలో వేసి పైనుంచి చెట్ల ఆకులు వేశాడు. అదే రాత్రి ఇంటికొచ్చి మద్యం తాగుతూ స్నేహితులకు శైలజను చంపిన విషయం తెలిపాడు. దీంతో ఈ విషయం పోలీసులకు తెలిసింది. అదేవిధంగా అటవీప్రాంతానికి వెళ్లిన కొందరు ఎర్రగుంట వద్ద వాసన వస్తోందని చెప్పడంతో సీఐ నాగార్జునరావు, ఎస్సై అభినవ్, క్లూస్ టీం ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా ఆ శవం శైలజదిగా గుర్తించారు. మృతురాలి తల్లి దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా దర్యాప్తు చేస్తున్న క్రమంలో రమేష్ పెద్దమనిషితో వచ్చి లొంగిపోయాడని సీఐ తెలిపారు. దీంతో అతడిని రిమాండ్‌కు తరలించామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి

కార్ అండ్ బైక్ రేస్



డిసెంబర్ నెల కూపన్ నంబర్ - 2

పాఠకుని పూర్తి పేరు : ....
డోర్ నెంబరు : ....
వీధి పేరు : ....
గ్రామం / పట్టణం : ....
మండలం : ....
జిల్లా : ....
పోస్టల్ పిన్‌కోడ్ : ....
ఫోన్ నంబర్ : ....

నాలుగు నెలల్లో ఆంధ్రజ్యోతి డ్రాలో ఇది డిసెంబర్ నెల రెండవ కూపన్ ఈ కూపన్‌లో మీ అడ్రస్ పూర్తి చేసి ఈ నెలలో ఇచ్చే మూడు కూపన్లను ఒక సెట్‌గా చేసి మీ వద్దనే ఉంచి మూడు నెలలు అయిన తర్వాత మొత్తం 9 కూపన్లను మూడు సెట్లుగా చేసి 2025 మార్చ్ నెల 10వ తేది నాటికి ఈ క్రింది అడ్రస్‌కు పోస్ట్ ద్వారా కాని, స్వయంగా కాని అందచేయవలెను.



నోట్ : సెట్‌గా కాకుండా విడిగా పంపిన కూపన్లు చెల్లవు.

* చట్ట ప్రకారం నిబంధనలు వర్తించును.

కూపన్లు పంపవలసిన చిరునామా

అడ్రస్ : ఆంధ్రజ్యోతి బిల్డింగ్స్,
సర్వే నెం. 1054, మడికొండ, జిల్లా హనుమకొండ, పిన్‌కోడ్-506142
అసిస్టెంట్ మేనేజర్ (సర్క్యులేషన్) సెల్ : 9985411664, బ్రాంచ్ మేనేజర్ : 9985411661



ఎంపీని సన్మానిస్తున్న ఐఎన్‌టీయూసీ, డ్రైవర్ల యూనియన్ నేతలు

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

మానుకోట ఎంపీ పోరిక బలరాంనాయక్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ వాహన డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మానుకోట పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాంనాయక్ అన్నారు. హైదరాబాద్‌లో శనివారం ఎంపీ బలరాంనాయక్‌ను కలిసిన వివిధ డ్రైవర్స్ యూనియన్ నేతలు తమ సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాంనాయక్ మాట్లాడుతూ.... వాహన డ్రైవర్లు ఏ సమస్య ఉన్న తనకు తెలియజేస్తే వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అనంతరం ఎంపీ బలరాంనాయక్‌ను శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, జే సీతారాంరెడ్డి, మాందాటి శ్రీనివాస్, అశోక్‌రెడ్డి, శివ, వీరన్న, మల్లేష్, ఉపేందర్, రవి పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

సీపీఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్ కుమార్



కాజీపేట, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సాయంత్రం 3 గంటలకు ఇస్లామియా కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్దఎత్తున తరలిరావాలని సీపీఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్ కుమార్ కోరారు. కాజీపేట మీడియా పాయింట్‌లో శనివారం కందుల జీవన్‌కుమార్ మాట్లాడారు. ఇటీవల కేంద్ర మంత్రి వర్గం యూపీఎస్ విధానాన్ని ఆమోదం తెలిపిందని, ఏప్రిల్ 1, 2025 నుంచి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు చేయనున్న ఏకీకృత పెన్షన్ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. ఏకీకృత విధానం ఉద్యోగులను మోసగించి కార్పొరేట్ల కడుపు నింపడానికే వచ్చిందన్నారు. ఆదివారం జరుగనున్న భారీ బహిరంగ సభకు రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు లింగ మూర్తి, బుచ్చన్న, కోశాధికారి నరేశ్‌గౌడ్ తదితరులు హాజరుకానున్నారని ఉద్యో గ, ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు కాకతి కదన భేరి

వరంగల్ ఎడ్యుకేషన్: పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ సీపీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం కాకతి కదనభేరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కందుల జీవన్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సీపీఎస్‌తో పాటు యూపీఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తూ కాకతి కదన భేరిని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆదివారం వరంగల్‌లోని ఇస్లామియా కళాశాల గ్రౌండ్‌లో ఉపాధ్యాయ, ఉద్యోగులతో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, ఉపాధ్యక్షులు లింగమూర్తి, బుచ్చన్న తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని తెలిపారు. ఉపాధ్యాయ, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

రాష్ట్రాన్ని క్రీడా హబ్‌గా తీర్చిదిద్దుతాం

వరంగల్ ఎంపీ కడియం కావ్య



విజేతలకు కప్‌ను అందిస్తున్న ఎంపీ కావ్య, కలెక్టర్, అధికారులు

జనగామ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణను క్రీడల హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. జిల్లా స్థాయి సీఎం కప్-2024 ముగింపు కార్యక్రమం శనివారం జనగామ జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీ, కలెక్టర్ హాజరై విజేతలకు ప్రశంస పత్రాలను అందజేసి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సీఎం కప్‌లను అందజేశారు. కావ్య మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడల ఎంతో ముఖ్యమని, క్రీడలతో మానసికంగా ఉల్లాసంగా, శారీరకంగా దృఢంగా తయారువుతారని తెలిపారు. యువత చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. పల్లెల నుంచి ప్రపంచ స్థాయి క్రీడాకారులను తయారు చేయాలనే ఉద్దేశంతోనే సీఎం కప్ టోర్నమెంటులను నిర్వహిస్తోందన్నారు.

కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 16 నుంచి 20 వరకు యోగా, పారా ఒలింపిక్ క్రీడలు, తదితరల 28 రకాల క్రీడలను నిర్వహించమన్నారు. విజేతగా నిలవడం కంటే ముఖ్యంగా పాల్గొనడం ప్రధానమన్నారు. కార్యక్రమంలో జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మారుజోడు రాంబాబు, మునిసిపల్ ఛైర్‌పర్సన్ పోకల జమున, ఏసీపీ పార్థసారథి, డీవైఎస్‌వో వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీవో వసంత తదితరులు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి

పెద్దవంగర, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భూ నిర్వాసితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని పోచంపల్లి గ్రామంలో దేవాదుల భూ నిర్వాసితులకు ప్యాకేజీ-6 ద్వారా చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం అబ్బురపడేలా తెలంగాణలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కొనసాగుతున్నాయన్నారు. దేవాదుల ప్రాజెక్టు వంటి అభివృద్ధి కార్యక్రమాలు రాష్ట్ర ప్రగతి దిశగా ముందడుగు వేస్తాయని తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా భూమి కోల్పోయిన రైతులు నష్టపోకుండా వారికి ప్రభుత్వం అండగా ఉంటూ సమగ్ర పునరావాస పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్యాకేజీ-6 ద్వారా పారదర్శక విధానంతో భూ నిర్వాసితులకు నిధులను పంపిణీ చేశామన్నారు. మండలంలోని పోచంపల్లి, గంట్లకుంట గ్రామాల పరిధిలో 89 మంది రైతులకు రూ.3.13కోట్లును అందించారు. కార్యక్రమంలో ఆర్డీవో గణేష్, తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అనుమాండ్ల తిరుపతిరెడ్డి, దేవాదుల ప్రాజెక్టు ఈఈ సీతారామ్‌నాయక్, డీఈ కిషన్‌ప్రసాద్, ఏఈ కిషోర్, ఎంపీడీవో వేణుమాధవ్, బ్లాక్ అధ్యక్షుడు హమ్యానాయక్, మండల అధ్యక్షుడు ముద్దసాని సురేష్, విజయపాల్‌రెడ్డి, రంగు మురళిగౌడ్, శ్రీనివాస్, మదన్‌మోహన్‌రావు, సోమన్న, వెంకన్న, సీతారామ్, చంద్రశేఖర్, రాజుయాదవ్, గోపాల్, సతీష్, వేణు, శ్రీనివాస్, ఉప్పలయ్య, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



భూ నిర్వాసితులకు చెక్కును అందిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

భూమిని కబ్జా చేశారని..
దివ్యాంగుడి ఆత్మహత్యాయత్నం

రెవెన్యూ, పోలీసు సిబ్బంది అప్రమత్తంతో తప్పిన ముప్పు

దంతాలపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : హైకోర్టు పరిధిలో (వివాదంలో) ఉన్న సాగు భూమిని ఓ వ్యక్తి అక్రమంగా దున్నతున్నాడంటూ ఓ దివ్యాంగుడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండల కేంద్రంలో శనివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామానికి చెందిన దివ్యాంగుడు అయినాల ఓంశంకర్ సాగులో ఉన్న రెండెకరాల భూమిని శనివారం పాక ధర్మయ్య దున్నుతున్నాడు. శనివారం మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో హైకోర్టు పరిధిలో ఉన్న భూమిని అదే గ్రామానికి చెందిన పాక ధర్మయ్య అక్రమంగా పట్టాదారు పాసు పుస్తకం పొందాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన దివ్యాంగుడు ఓంశంకర్ తన భార్య మంజులతో కలిసి తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఈ క్రమంలో సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకొని కోర్టులో ఉన్న భూమి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఓంశంకర్‌కు నచ్చచెప్పారు. దీంతో ఓంశంకర్ తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు.

అనంతరం పోలీసులు ఓంశంకర్‌కు స్టేషన్‌లో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. కోర్టు పరిధిలో ఉన్న భూమిపై నివేదిక వచ్చే వరకు అక్రమంగా మోకాపై ఎవరూ వెళ్లొద్దని పోలీసులు పేర్కొన్నారు.



పెట్రోల్ మీద పోసుకుంటున్న శంకర్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

సర్కారు తీరుపై ఏఎన్‌ఎంల నిరసన



భూపాలపల్లిలో రాస్తారోకో చేస్తున్న ఏఎన్‌ఎంలు

భూపాలపల్లి కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను సర్కారు పట్టించుకోవడం లేదని ఏఎన్‌ఎంలు నిరసనకు దిగారు. భూపాలపల్లి పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో జాతీయ రహదారిపై శనివారం రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఏఎన్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షురాలు సునీత మాట్లాడుతూ 18 ఏళ్లుగా వెట్టిచాకరీ చేస్తున్నా ప్రభుత్వాలు తమను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సర్వీసులను రెగ్యులర్ చేయాలని 48 గంటల దీక్షలో భాగంగా జాతీయ రహదారిపై ఈ నిరసనను తెలపాల్సి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఆశపడగా అవి అడియాసలే అయ్యాయన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రాత పరీక్ష రద్దు చేసి సీనియారిటీ ప్రకారం రెగ్యులర్ చేయా లన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు సదాలక్ష్మి, యాదలక్ష్మి, సంధ్యారాణి, రజిత. సాధన, విజయ తదితరులు పాల్గొన్నారు.

ములుగులో ర్యాలీ

ములుగు కలెక్టరేట్ (ఆంధ్రజ్యోతి): రాత పరీక్ష రద్దుచేసి రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు శనివారం ములుగులోని బండారుపల్లి రోడ్డుపై ర్యాలీ నిర్వహించి రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రత్నం రాజేందర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి జంపాల రవీందర్‌లు మాట్లాడారు. 25ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను ప్రభుత్వాలు అన్యాయం చేస్తూనే వస్తున్నాయని అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వారికి రాత పరీక్ష నిర్వహించాలనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచించి రాత పరీక్షను రద్దు చేసి యథావిధిగా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు జమున, సూర్యకాంతమ్మ, మంజుల, సుగుణవతి, అరుణ, సీత, సునీత, సోమలక్ష్మి, అనురాద, లక్ష్మి, కౌసల్య, తిరుమల, చంద్రకళ, పుష్పలత, గీత, కనకలక్ష్మి, సుశీల తదితరులు పాల్గొన్నారు.

వైద్య శాఖలో పోస్టుల భర్తీ

27న ఇంటర్వ్యూలు

జనగామ రూరల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): వైద్యశాఖలో క్వాలిటీ మేనేజర్, ఎపిడమాలజిస్ట్ పోస్టుల కొరకు ఈనెల 27న వాక్ ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్‌వో మల్లికార్జునరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులకు అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన నేషనల్ మిషన్ స్కీం ద్వారా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. క్వాలిటీ మేనేజర్ (1 పోస్టు)కు నెలకు రూ.40 వేల వేతనం చెల్లిస్తారని, మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ మేనజ్‌మెంట్/మాస్టర్స్ ఇన్ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ /మాస్టర్స్ డిగ్రీ ఇన్ హెల్త్ కేర్ మేనేజ్ మెంట్ అర్హత కలిగి ఉండి కనీసం 3 సంవత్సరం అనుభవం కలిగి ఉండాలన్నారు.

ఎపిడమాల జిస్టు (1 పోస్టు)కు నెలకు రూ.50వేల వేతనం చెల్లిస్తారని, ఎంబీబీఎస్ అండ్ ఎండీ ప్రివెన్టివ్ మెడిసిన్ / ఎంబీబీఎస్/ బీడీఎస్/బీఏఎంఎస్/ బీఎస్సీ నర్సింగ్, మాస్టర్స్ ఇన్ పబ్లిక్ హెల్త్/డిప్లొమా ఇన్ ఎమ్మెస్సీ ఇన్ లైఫ్ సైన్స్ / 2 సంవత్సరాల మాస్టర్స్ ఇన్ పబ్లిక్ హెల్త్ లేదా ఎమ్మెస్సీ ఎపిడిమాలజీ అర్హతతో 2 సంవత్సరాల అనుభవం కలిగి ఉండాలన్నారు. అర్హత, ఆసక్తి గల వారు అన్ని విద్యార్హత పత్రాలతో ఈనెల 27న మధ్యాహ్నం 2 గంటలకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూలకు హాజరు కావాలన్నారు.

వీణా వాణిలను కలిసిన తల్లిదండ్రులు



వీణావాణిలతో పేరెంట్స్ మురళి, నాగలక్ష్మి

దంతాలపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అవిభక్తల కవలలు వీణావాణిలను శనివారం వారి తల్లిదండ్రులు మారగాని మురళి, నాగలక్ష్మి శుక్రవారం హైదరాబాద్‌లోని స్టేట్ హోంలో కలిశారు. ఈ సందర్భంగా మురళి, నాగలక్ష్మి మాట్లాడుతూ తమ అవిభక్త కవలలను విడదీసేందుకు రాష్ట ప్రభుత్వం ముందుకు రావాలని కోరారు. వీణావాణిలు నేటికి 21 వసంతాలు పూర్తి చేసుకున్నారని ప్రస్తుతం వారు డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వాలను తమ కుటుంబాన్ని ఆదుకోవాలంటూ వేడుకున్నా నేటికి ఫలితం లేదన్నారు. అవిభక్త పిల్లల వద్దకు వెళ్లాలంటే తమకు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు వస్తున్నాయన్నారు. మారుతున్న ప్రభుత్వాలు పలు దఫాలుగా ముందుకొచ్చి ఆర్థికసాయం చేస్తామన్న విషయాన్ని వారు గుర్తు చేశారు. నేటికి ఎలాంటి సాయం రాలేదన్నారు.

రాష్ట్ర స్థాయి
పారా క్రికెట్‌కు వెల్డి యువకుడు



యెంగలి నాగేష్

రఘునాథపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి పారా (వికలాంగుల) క్రికెట్ పోటీలకు రఘునాథపల్లి మండలం వెల్దికి చెందిన యెంగలి నాగేష్ ఎంపికయ్యారు. రెండు కాళ్లు పని చేయకపోయినా మనిషి తలచుకుంటే ఏదైనా సాధించగలుగుతాడని నాగేష్ నిరూపించాడు. జనగామ జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పారా క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానం దక్కించుకుని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. జిల్లాలో ఉత్తమ పారా క్రికెటర్‌గా బంగారు పతకం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయిన నాగేష్‌ను ప్రజలు అభినందించారు.

కేంద్ర మంత్రి అమిత్‌షా
వెంటనే రాజీనామా చేయాలి

సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జీ నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రహోం శాఖ మంత్రి అమిత్‌షా వెంటనే రాజీనామా చేయాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు జి. నాగయ్య డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో శనివారం సీపీఎం జిల్లా కమిటీ, మండలాల కమిటీ సభ్యులు, ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని అల్వాల వీరయ్య అధ్యక్షతన నిర్వహించారు.

ఈ సందర్భంగా హాజరైన నాగయ్య మాట్లా డుతూ...పార్లమెంట్ సాక్షిగా డాక్టర్ బీఆర్. అంబేద్కర్‌ను అవమానిం చేలా మాట్లాడిన అమిత్‌షా కేంద్ర మంత్రి పదవిలో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. తక్షణమే స్వచ్ఛందంగా హోంమంత్రి పదవి నుంచి తప్పుకోవాలన్నారు. బీజేపీ మనువాద ధోరణి మరోసారి పార్లమెంటులో బయటపడిందన్నారు. దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడడం, పార్లమెంట్ ప్రతిష్టతను అ గౌరవపర్చడం రాజ్యాంగ విలువలను అగౌరవపర్చడమేనని చెప్పారు. అదానీ కుంభకోణాలు బయటపడకుండా ఉంచేందుకు జమిలీ ఎన్నికలు అనే కొత్త ఏజెండాను ముందుకు తీసుకువస్తున్నారని విమర్శించారు. ప్రజలను మరింత పేదరికంలో నెట్టే ప్రయత్నంలో భాగమే జమిలీ ఎన్నికలని ఆరోపించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, గునిగంటి రాజన్న, ఆకుల రాజు, కందూనూరి శ్రీనివాస్, కుంట ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

టెస్టింగ్‌కు లక్ష్మీ పంప్‌హౌస్ మోటార్లు సిద్ధం

మహదేవపూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : భూపాలపల్లి జయశంకర్ జిల్లాలోని మహదేవపూర్ మండలం కాళేశ్వరం మేడిగడ్డ ప్రాజెక్టులోని లక్ష్మీ పంప్‌హౌస్ మోటార్లు టెస్టింగ్‌కు సిద్ధంగా ఉన్నాయి. రెండేళ్ల క్రితం క్రితం భారీ వర్షాలు రావడంతో గోదావరి, ప్రాణహిత ఉప్పొంగి పంప్‌హౌస్ పూర్తిగా మునిగిపోయిన విషయం విదితమే. పంప్‌హౌస్ మోటార్లతో పాటు పలు యంత్రాలు, కంప్యూటర్లు నీటమునిగిపోయాయి. మళ్లీ అధికారులు, కాంట్రాక్టర్లు వాటికి మరమ్మతు చేసే పనులు ప్రారంభించారు. ఇప్పటి వరకు 17 మోటార్ల మరమ్మతులు పూర్తయ్యాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు టెస్టింగ్ కోసం మోటార్లను రన్ చేసేందుకు ఫోర్‌బేను వాటర్‌తో నింపి రేపో మాపో రన్ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ రన్ పూర్తయిన వెంటనే ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే ఈ 17 మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేయనున్నట్లు ఇంజనీరింగ్, ఇరిగేషన్ అధికారులు తెలిపారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి

ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ

బాలసముద్రం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లా అభివృద్ధికి జిల్లా ప్రజాప్రతినిధులంతా సమష్టిగా కృషి చేయాలని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ కోరారు. ఉమ్మడి వరంగల్ జిల్లా, వరంగల్ నగర సమగ్ర అభివృద్ధిపై హనుమకొండలోని హరిత హోటల్‌లో ఫోరం ఫర్ బెటర్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా మేధావుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమావేశానికి బెటర్ వరంగల్ అధ్యక్షుడు పుల్లూరు సుధాకర్ అధ్యక్షత వహించారు. సమావేశంలో వెంకటనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పడడానికి ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు కీలక నిర్ణయం తీసుకున్నారని, దానికి ప్రతిఫలంగా ఇప్పటి నాయకత్వం జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు. పదేళ్లలో ఉమ్మడి వరంగల్ జిల్లా, నగరం చాలా వెనుకబడిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే కోయంబత్తూర్, విశాఖపట్నం నగరాల్లాగా వరంగల్ నగరం అభివృద్ధి చెందుతుందని ప్రజలు ఆశించారని అన్నారు. జిల్లా, నగర అభివృద్ధికి జిల్లా పౌర సమాజం, మేధావులు నగర అభివృద్ధి ఎప్పటికప్పుడు తగిన సూచనలు ఇవ్వాలని ఆయన పిలుపు నిచ్చారు.

మాజీ మేయర్ డాక్టర్ టి.రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ.. మామునూరు ఎయిర్‌పోర్టు, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, వరంగల్ పారిశ్రామికాభివృద్ధి వరంగల్ కేంద్రంగా ఉంటే, విద్య, వైద్యానికి నైపుణ్య మానవ వనరుల సేవా రంగానికి హనుమకొండ ప్రాంతం నిలయమవుతుందని, ఈ రెండు ప్రాంతాలు కలిస్తేనే పరస్పరం అభివృద్ధి చెందుతాయని అభిప్రాయపడ్డారు. సమావేశానికి అధ్యక్షత వహించిన పుల్లూరు సుధాకర్ మాట్లాడుతూ.. వరంగల్ నగరం, ఉమ్మడి జిల్లా అభివృద్ధి పరిస్థితిని గణాంకాలతో సహా వివరించారు. ఈ సందర్భంగా ఆయన వరంగల్ విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా విభజనతో జిల్లా తన రాజకీయ, చారిత్రక అస్థిత్వాన్ని కోల్పోయిందని వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి వరంగల్ జిల్లాగా ఏర్పాటు చేయాలని రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ సభ్యుడు ముద్దసాని సహోదర్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ల సంఘం అధ్యక్షుడు ప్రొఫెసర్ సదానందం మాట్లాడుతూ.. వరంగల్ పేరు శతాబ్దాల తరబడి వారసత్వ చిహ్నంగా ఉందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అభిప్రాయపడ్డారు. వరంగల్ నగరాన్ని రాష్ట్ర రెండో రాజధానిగా చేయాలని భూగర్భ డ్రెయినేజీ, మామునూరు ఎయిర్ పోర్టు, కాజీపేట జంక్షన్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు పనులను యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలని సమావేశంలో తీర్మానించారు. వరంగల్ జిల్లా అభివృద్ధి పనులకు రూ.6వేల కోట్ల నిధులను మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డికి సమావేశం కృతజ్ఞతలు తెలిపింది. ఈ సమావేశంలో దాసరి కృష్ణారెడ్డి, ప్రొఫెసర్ విజయబాబు, ప్రొఫెసర్ రామిరెడ్డి, ప్రొఫెసర్ సారంగపాణి, వి.బాబురావు, పురుషోత్తం, సోమ రామమూర్తి, అడ్వకేట్ వద్దిరాజు గణేష్, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య, మండల పరశురాములు, కవి సిరాజ్, జోగు చంద్రశేఖర్, ఇంకా పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని ఉమ్మడి జిల్లా సమగ్రాభివృద్ధికి సూచనలు అందించారు. ఇలాంటి మరో సమావేశాన్ని ఈసారి వరంగల్‌లో ఏర్పాటు చేయాలని వారు నిర్ణయించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట నారాయణ

గణితంలో సమస్యల సాధన ముఖ్యం



విద్యార్థులు సబ్జెక్టులోని ప్రాథమిక భావనలపై పట్టు సాధించాలి. 10వ తరగతి గణితంలో 14 అధ్యాయాలు ఉన్నాయి. ప్రతీ అధ్యాయంలో 4 నుంచి 6 కాన్సెప్ట్‌లు ఉంటాయి. వీటిని అర్థం చేసుకొని సాధన చేయాలి. గణితంలో చదవడం కంటే సాధన చేయడం ముఖ్యం. విద్యార్థులు సమస్యలను సాధన చేయడం మరిచిపోవద్దు. ప్రతీ చాప్టర్‌లోని దూ దిస్ ప్రాబ్లమ్స్‌తో పాటు ట్రై దిస్ ప్రాబ్లమ్స్‌ను తప్పకుండా సాధన చేయాలి. పరీక్షలో అడిగే ప్రతీ ప్రశ్నకు విద్యార్థులు సమాధానాలు రాయాలి. ప్రతీ ప్రశ్నకు కనీస దత్తాంశం రాస్తే కనీస సామర్థ్యాలున్న విద్యార్థులు సైతం పాస్ అయ్యే అవకాశం ఉంటుంది.

కావటి కనకయ్య, గణిత ఉపాధ్యాయుడు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, వరంగల్

సులభం.. జీవశాస్త్రం ఆసక్తికరం ..

పదో తరగతిలో మిగతా సబ్జెక్టులతో పోలిస్తే బయోలాజికల్ సైన్స్ ఆసక్తికరమైన సులభతరంగా ఉంటుంది. పదో తరగతి జీవశాస్త్రంలో 10 యూనిట్లు ఉంటాయి. విద్యార్థులు విషయావగాహన, ప్రయోగాల నిర్వహణ, నిజజీవితంలో అన్వయం, బొమ్మలకు సంబంధించిన అంశాలపై ప్రధానంగా దృష్టి సారించాలి.

కీలక భావనలైన పోషణ, జీర్ణక్రియ, శ్వాసక్రియ, విసర్జన క్రియ, రక్తప్రసరణ, ప్రత్యుత్పత్తి తదితర పాఠ్యాంశాల భావనలపట్ల అవగాహన కలిగి ఉండాలి. విషయావగాహనకు సంబంధించిన ప్రశ్నలు వివరించడం, బేధాలు రాయడం, బొమ్మల ద్వారా వివరించడం ప్రయోగాలకు సంబంధించిన అంశాలు, ప్రయోగ పరికరాలు, విధానం, పరిశీలన, జాగ్రత్తలు, నిజ జీవిత అన్వయాలపట్ల స్పష్టమైన అవగాహన ఉండాలి. పట్టికలు, వాటికి సంబంధించిన దత్తాంశ విశ్లేషణపై బాగా సాధన చేయాలి. బొమ్మలకు సంబంధించిన ప్రశ్నలను వివరించడం, భాగాలను గుర్తించడం తదితర అంశాలతో కూడి బహుళైచ్ఛిక ప్రశ్నలను సాధన చేయాలి. పరీక్ష సమయంలో ప్రతీ విభాగానికి సంబంధించిన సమయపాలన, సమాధాన నిడివి, భావనల ముఖ్యాంశాలను దృష్టిలో ఉంచుకొని సమాధానాలు రాస్తే విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తారు.



చల్లా కృష్ణారెడ్డి, బయోలాజికల్ సైన్స్ టీచర్, బొల్లికుంట జడ్పీహెచ్ఎస్

పరీక్షల కాలం..

- లక్ష్యంతో చదివితే విద్యార్థుల విజయం
- ప్రాథమిక భావనలను అర్థం చేసుకోవాలంటున్న విషయ నిపుణులు
- ఇష్టపడి చదివితే ఒత్తిడి దూరం

ప్రణాళికకే ప్రధానం



వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పరీక్షల కాలం ముందుంది.. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే విజయం వారి దరికి చేరుతుందని విషయనిపుణులు చెబుతున్నారు. ప్రతీ సబ్జెక్టులో ప్రాథమిక భావనలను అర్థం చేసుకొని వాటిని ఆచరణలో పెట్టగలిగితే ప్రతీ విద్యార్థి ఉత్తమ ఫలితాలు సాధిస్తారని వారు స్పష్టం చేస్తున్నారు. ఇక ఇష్టపడి చదివితే ఎలాంటి ఒత్తిడి లేకుండా పరీక్షల్లో ఫలితాల విజయాల్ని అలవోకగా ఒడిసిపట్టుకోవచ్చునని మనోవికాస నిపుణులు సూచిస్తున్నారు. ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల టైంటేబుల్ విడుదలైంది. మార్చి 5 నుంచి 24 వరకు పరీక్షలు నిర్వహించేందుకు షెడ్యూల్‌ను ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఇక వెనువెంటనే టెన్త్ పరీక్షలు సైతం మార్చి 22 నుంచి ప్రారంభం కానున్నాయి. మరో మూడు నెలల్లో పదో తరగతి, ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షలో విజయాలు సాధించి అత్యున్నత ఫలితాలు సాధించాలంటే ఎలాంటి సాధన చేయాలనే విషయాలపై విషయ నిపుణులు, మనోవికాస నిపుణులు విద్యార్థులకు పలు సలహాలను అందజేస్తూ, సూచనలిస్తున్నారు.

ప్రాథమిక భావనలపై పట్టు సాధించాలి

పరీక్షలకు మరో మూడు నెలల కాలం ఉండటం, సమయం సమీపిస్తుండటంతో విద్యార్థులు జాగ్రత్తతో చదవాల్సిన అవసరముందని విషయనిపుణులు చెబుతున్నారు. మూడు నెలల కాలానికి టైంటేబుల్ వేసుకొని మరీ ప్రణాళికబద్ధంగా చదవాలంటున్నారు. ప్రతీ సబ్జెక్టులో ప్రాథమిక భావనలను ఆకళింపు చేసుకొని వాటిపై పట్టు సాధించాలంటున్నారు. ఉపాధ్యాయులు బోధించిన అంశాలతో పాటు పుస్తకాల్లోని అంశాలను క్షుణ్ణంగా చదువుతూ ప్రశ్నలకు అనుగుణంగా జవాబులను రాసేందుకు ఇప్పటి నుంచే సాధన చేయాలని సూచిస్తున్నారు. పరీక్షల్లో ప్రతీ ప్రశ్నకు జవాబు రాసేందుకు విద్యార్థులు సన్నద్ధం కావాలని సూచిస్తున్నారు. సబ్జెక్టుల వారిగా సమయాన్ని కేటాయించుకొని చదువుకోవాలంటున్నారు. చదువుకోవడాన్ని సంక్లిష్టంగా చూడకుండా సులువుగా అనుకుంటే విజయాలు తథ్యమని అంటున్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి



పరీక్షల సమయాల్లో విద్యార్థులు ఒత్తిడికి గురవు తారు. ఇష్టపడి చదివితే ఎలాంటి ఒత్తిడి ఉండదు. పరీక్షల సమయాల్లోనే కాకుండా ముందు నుంచి ప్రణాళికను వేసుకొని చదివితే మానసిక ఆందోళన పూర్తిగా దూరమవుతుంది. మనసులో పరీక్షలను భూతంగా చూడకుండా సాధారణంగానే చూడాలి. తల్లిదండ్రులు పరీక్షల సమయాల్లో విద్యార్థులపై ఒత్తిడిని పెంచకుండా వారిలో మనోధైర్యాన్ని నింపాలి.

డాక్టర్ బరుపాటి గోపి, మనోవికాస నిపుణుడు, వరంగల్

భయాన్ని వీడితే భౌతిక శాస్త్రంలో మార్కులు



ఫిజికల్ సైన్స్ అంటే విద్యార్థులు సహజంగానే భయపడుతుంటారు. అయితే భయాన్ని వీడితే భౌతికశాస్త్రంలో విద్యార్థులు బహుచక్కని మార్కులు సాధించవచ్చు. ఫిజికల్ సైన్స్‌లో భేదాలు, ఉదాహరణలపై ఫోకస్ చేయాలి. ఉదాహరణలు ఎక్కువగా సాధన చేయాల్సి ఉంటుంది. ప్రయోగాలు, క్షేత్ర పరిశీలనలు, బొమ్మలు గీయడం, నమూనాలు తయారు చేయడం తదితర అంశాలను విద్యార్థులు సాధన చేయాలి. విద్యార్థులు ప్రశ్నాపత్రంలో వచ్చే ప్రశ్నలను క్షుణ్ణంగా పరిశీలిస్తే జవాబులు సులువుగా రాయవచ్చును. ఫిజిక్స్ నిత్యజీవితంలో ఉపయోగాలపై దృష్టి సారించాలి. సీసీఈ పద్ధతిలో నేరుగా ప్రశ్నలు అగడరు అందువల్ల విద్యార్థులు ప్రిపేర్ అయ్యేటప్పుడు ప్రశ్నలు అడిగే విధానాన్ని దృష్టిలో పెట్టుకొని సాధన చేయాల్సి ఉంటుంది.

పీ కృష్ణమూర్తి, ఫిజికల్ సైన్స్ టీచర్, కొంకపాక జడ్పీహెచ్ఎస్

మాతృభాషలో మంచి మార్కులు సాధించొచ్చు..



తెలుగు వార్షిక పరీక్షలో మూడు సామర్థ్యాల ఆధారంగా 80 మార్కులకు ప్రశ్నాపత్రం ఉంటుంది. మొదటి సామర్థ్యం అవగాహన, ప్రతిస్పందన దీని కోసం 20 మార్కులు, రెండో సామర్థ్యం వ్యక్తీకరణ, సృజనాత్మకతకు సంబంధించిన 40 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ఇక మూడో సామర్థ్యం భాషాంశాలకు సంబంధించి 20 మార్కుల ప్రశ్నలు ఉంటాయి. ఉపవాచకం నుంచి పేరాగ్రాఫ్‌లు ఇచ్చి వాటిపై ప్రశ్నలు అడుగుతారు. ఉపవాచకంపై పట్టు సాధిస్తే మార్కులు సులభంగా పొందవచ్చును. ఇక పాఠ్యపుస్తకంలోని చుక్క గుర్తు ఉన్న పద్యాల్లోని ఏవైనా రెండింటిని ఇచ్చి వాటికి ప్రతిపదార్థాలు రాయమని, లేదంటే పద్యాన్ని పూరించమని అడిగే అవకాశం ఉంటుంది. పాఠాల కవులు, పరిచయాలను నేర్చుకోవాలి.

పాఠాల వెనక భాగంలో ఉన్న ఆలోచించి చెప్పండిలో ప్రశ్నలకు చదివితే 12 మార్కులు సాధించవచ్చు. కరపత్రం, వ్యాసాలు, సంభాషణలు, లేఖ, ఆత్మకథ, అభినందన వ్యాసం, నినాదాలు, సూక్తులు వంటి వాటిని నేర్చుకుంటే 28 మార్కులు సాధించవచ్చును. విద్యార్థులు తెలుగు వ్యాకరణంపై దృష్టి సారిస్తే సులువుగా మార్కులు సాధించేందకు అవకాశం ఉంటుంది.

వలస పైడి, తెలుగు ఉపాధ్యాయుడు, మర్కజీ ప్రభుత్వ హైస్కూల్, హనుమకొండ

ఇంగ్లిష్‌లో మార్కులు వెరీ ఈజీ



టెన్త్ ఇంగ్లిష్ వార్షిక పరీక్షలో మార్కులు చాలా సులభంగా సాధించవచ్చు. ఇంగ్లిష్ ప్రశ్నా పత్రంలో రెండు పార్ట్‌లు ఉంటాయి. పార్ట్ ఏ 60 మార్కులకు, పార్ట్ బీ 20 మార్కులకు ఉంటుంది. కాంప్రెహెన్షన్ రీడింగ్‌పై దృష్టి సారిస్తే 24 మార్కులు సాధించ వచ్చును. టేబుల్స్, పైచార్ట్స్, బార్ డయాగ్రామ్స్, ఫ్లోచార్ట్స్ లాంటి స్టడీ స్కిల్స్‌ను సాధన చేయాలి. ట్రాన్స్‌ఫార్మేషన్ ఆఫ్ సెంటెన్స్, మేజర్, మైనర్ డిస్కోర్స్‌పై పట్టు సాధించాలి. పార్ట్ బీలో అన్‌సీన్ పాసెజ్‌లు వస్తాయి. ఇంగ్లిష్ గ్రామర్‌ను క్షుణ్ణంగా నేర్చుకోవాలి.

పూల శ్రీనివాస్, ఇంగ్లిష్ టీచర్, తిమ్మాపూర్ జడ్పీహెచ్ఎస్

హిందీలో ఉత్తీర్ణత సులువే..



హిందీ పరీక్షలు విద్యార్థులు సులువుగా ఉత్తీర్ణత సాధించవచ్చును. 80 మార్కుల ప్రశ్నాపత్రాన్ని అందుకున్నాక విద్యార్థులు ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా అర్థం చేసుకున్నాకే జవాబులు రాయడం ప్రారంభించాలి. పేరాగ్రాఫ్ ప్రశ్నలను సాధన చేస్తే 20 మార్కులు సాధించవచ్చును. కవిపరిచయాలను సాధన చేయాలి. డీ స్కోర్స్‌లపై అవగాహన కలిగి ఉండాలి. హిందీ గ్రామర్‌పై పట్టు సాధిస్తే 20 మార్కులు సులువుగా సాధించవచ్చును.

షర్ఫొద్దీన్, రిటైర్డ్ హిందీ టీచర్, వరంగల్

పాఠ్య పుస్తకాన్ని క్షుణ్ణంగా చదవాలి



టెన్త్ వార్షిక పరీక్షల్లో సోషల్ పాఠ్య పుస్తకం నుంచే ప్రశ్నలు అడుగుతారు. విద్యార్థులు వాటినే పరిగణలోకి తీసుకొని సాధన చేయాలి. విష య అవగాహన ప్రశ్నలు, పేరాగ్రాఫ్ చదివి వ్యాఖ్యా నించడం, పట్టికలు, గ్రాఫ్‌ల విశ్లేషణ, భారతదేశ, తెలంగాణ పటాలు గీయడం, ఇండియా, ప్రపంచ పటాల్లో ప్రదేశాలను గుర్తించడం, కీలక భావనలను సాధన చేయాలి. పాఠ్యాంశాల్లోని 2 మార్కుల ప్రశ్నలు, పటాలు, పట్టికలను సాధన చేస్తే పాస్ మార్కులు సాధించవచ్చును. తప్పులు లేకుండా రాయడాన్ని సాధన చేయాలి. సమకాలీన అంశాలపై విద్యార్థులు నిరతరం అవగాహన కలిగి ఉండాలి.

కసుబోజుల నర్సయ్య, సోషల్ టీచర్, మర్కజీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, హనుమకొండ

25 నుంచి పలు రైళ్ల రద్దు

గిర్మాజిపేట/డోర్నకల్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మూడోలైన్ నిర్మాణంలో భాగంగా ఈనెల 25 నుంచి జనవరి 9 వరకు వరంగల్ మీదుగా నడిచే పలు రైళ్లను దక్షిణమధ్య రైల్వే రద్దు చేసింది. మరికొన్ని రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. కాజీపేట- డోర్నకల్ ప్యాసింజర్ (మెమూ) ఈనెల 25 నుంచి జనవరి 9 వరకు రద్దు చేశారు.

గుంటూరు - సికిందరాబాద్ ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలును ఈనెల 28 నుంచి జనవరి 9 వరకు రద్దు చేశారు. విజయవాడ-సికిందరాబాద్ శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 27, జనవరి 1, 4, 7, 8, 9 తేదీల్లో రద్దు చేశారు. గుంటూరు - సికింద్రాబాద్ గోల్కొండ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈనెల 27 నుంచి జనవరి 9 వరకు రద్దు చేశారు. ఆ రైళ్లు పైతేదీలలో కాజీపేట-సికిందరాబాద్ మధ్యనే నడుస్తాయని దక్షిణమధ్య రైల్వే తెలిపింది.

దారి మళ్లించిన రైళ్లు

బల్లార్ష నుంచి కాజీపేట, వరంగల్ మీదుగా సికిందరాబాద్, విజయవాడ వెళ్లే పలు రైళ్లను ఈనెల 29 నుంచి జనవరి 9 వరకు వరంగల్, కాజీపేటకు రాకుండా దారిమళ్లించారు. ప్రతీ రోజు నడిచే విశాఖపట్టణం ఎల్‌టీటీ, శాలిమార్-హైదరాబాద్ తదితర డైలీ, వారాంతపు రైళ్లను వరంగల్, కాజీపేటకు రాకుండా విజయవాడ, గుంటూరు, పంగిడిపల్లి మీదుగా సికిందరాబాద్‌కు దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.


అదేవిధంగా సికిందరాబాద్ - విశాఖపట్టణం వందేభారత్‌ను జనవరి 7, 8, 9 తేదీల్లో, ఆదిలాబాద్ - తిరుపతి - ఆదిలాబాద్ కృష్ణా ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఈ నెల 27, 28, జనవరి 1, 4, 6, 7, 8 తేదీల్లో రీ షెడ్యూల్ చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది.

నేడు మహా కోలాటం ప్రదర్శన

- గిన్నిస్ బుక్ రికార్డు కోసం ప్రయత్నాలు
- ముంబై, హైదరాబాద్ నుంచి న్యాయ నిర్ణేతల రాక
- ప్రత్యేక అతిథిగా హాజరు కానున్న మంత్రి పొన్నం
- ముస్తాబైన పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం



వేడుకలకు ముస్తాబైన ఆలయం



పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం

భీమదేవరపల్లి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భీమదేవరపల్లి మండలం కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం ముస్తాబైంది. ఆదివారం పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా మహా కోలాట బృందం ప్రదర్శన నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఆధ్యాత్మిక విభాగంలో గిన్నిస్ బుక్ రికార్డు కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయి. గతంలో అధ్యాత్మిక విభాగంలో హనుమాన్ చాలీసా మహా కోలాట బృందం ప్రదర్శనలో 425 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రస్తుతం 1001మంది మహిళలతో హనుమాన్ చాలీసా మహా బృందం కోలాట ప్రదర్శనకు ఏర్పాట్లు చేస్తున్నారు. కొప్పూర్ పంచముఖ ఆంజనేయస్వామి ఆలయం, తపస్వి డ్యాన్స్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ మహా మహిళ కోలాట ప్రదర్శన నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి.

ఆదివారం మధ్యాహ్నం 1గంటలకు ఈ ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సుమారు 10 నిమిషాల పాటు సాగే హనుమాన్ చాలీసా మహా కోలాట బృందం ప్రదర్శనలో 1001మంది మహిళలతో పాటు పలువురు భక్తులు వేలాదిగా వచ్చే అవకాశం ఉన్నందున అందుకు తగ్గట్టుగా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ కాసం రమేష్‌గుప్తా తెలిపారు. తెలంగాణలోని వివిధ జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూర్, విజయవాడ, రాజమండ్రి తదితర ప్రాంతాల నుంచి మహిళ భక్తులు రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం జరిగే మహా కోలాట హనుమాన్ చాలీసా పారాయణానికి గిన్నిస్ బుక్ రికార్డును పరిశీలించేందుకు ముంబై, హైదరాబాద్ నగరాల నుంచి న్యాయనిర్ణేతలు రానున్నారు. అందుకోసం పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ పరిసర ప్రాంతాలను అందంగా ముస్తాబు చేశారు. 1001మంది మహిళలతో హనుమాన్ చాలీసా కోలాట ప్రదర్శన నిర్వహిస్తున్నామని ఆలయ చైర్మన్ కాసం రమేష్ గుప్తా, తేజస్వి డ్యాన్స్ అకాడమీ చైర్మన్ శ్వేత తెలిపారు. ఇది 12వ వార్షికోత్సవమన్నారు. ప్రతీ వార్షికోత్సవానికి బ్రహ్మోత్సవాలు, స్వామివారి జయంతి, శతచండీ యాగం, తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించామన్నారు. ఈ సారి హనుమాన్ చాలీసా మహా కోలాట బృందం ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఇతర ముఖ్య నాయకులు ఈ కార్యక్రమానికి హాజరవుతారన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఆలయ చైర్మన్ కాసం రమేష్ గుప్తా

గిన్నిస్ బుక్ రికార్డు అధ్యాతిక రంగంలో అర్హత పొందేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ గద్ద సమ్మయ్య, ఆలయ అర్చకుడు ఉపేందర్‌శర్మ, రమాదేవి, వంగ సంపత్, తనుకు వెంకటేష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

పల్లె ముంగిట ఆన్‌లైన్ సరుకులు

- గ్రామాలకు విస్తరించిన ఈ-కామర్స్ వ్యాపారం
- సమయం ఆదా, ఇంటి వద్దకే కావాల్సిన వస్తువు



సండే స్పెషల్
SUNDAY SPECIAL

హనుమకొండ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువులు మొదలు కొని ఖరీదైన ఎలక్ట్రానిక్ వస్తువుల వరకు ఇంట్లో అవసరమైన అన్ని వస్తువులు కొనుగోలుకు వివిధ ఈ-కామర్స్ సంస్థలు వేదికలుగా నిలుస్తున్నాయి. ఈ సంస్థలకు అనుబంధంగా జిల్లా కేంద్రాల్లో, పట్టణాల్లో కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు వెలిశాయి. వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాలకు విస్తృతంగా సేవలు అందిస్తున్నాయి. దీంతో స్థానిక యువతకు ఉపాధి లభి స్తోంది. వస్తువులను సకాలంలో డెలివరీ చేయడానికి నిర్వాహకులు ద్విచక్ర వాహనాలు ఉన్న వారిని నియమించుకుంటున్నాయి. యువకులు, విద్యావంతులు, మహిళలు, వ్యాపారస్థులు, ఉద్యోగ స్థులు ప్రస్తుతం ఈ-కొనుగోళ్ల విధానం వైపు ఎక్కువగా మొగ్గు చూపుతున్నారు. అధిక శాతం ఇంట్లో ఉదయం నుంచి రాత్రి వరకు ఉపయోగపడే ప్రతీ వస్తువు కొనుగోలు చేస్తున్నారు.

30 రకాల ఆన్‌లైన్ సంస్థలు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రముఖ ఈ-కామర్స్ సంస్థలకు అనుబంధంగా కార్యాలయాలు, ఏజెన్సీలు, కొరియర్ సంస్థలు కొనసాగుతున్నాయి. 25 సంస్థలకు అనుబంధంగా శాఖల వారీగా సేవలు అందుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో 30 రకాల ఆన్‌లైన్ సంస్థలు ఉన్నాయి. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, షాపిఫై, మింత్ర, ఎబై, క్వికర్, ఓలెక్స్ వంటి ఆన్‌లైన్ స్టోర్‌లు వీటిలో ఉన్నాయి. హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రాలు, ప్రధాన పట్టణాల్లో ఈ సంస్థలు అందుబాటులో ఉంటున్నాయి. స్టాక్ పాయింట్ నుంచి వీటిని ఆర్డర్ చేసిన వారి ఇళ్లకు చేరవేస్తూ పలువురు నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నారు.



ఆన్‌లైన్ వ్యాపారం ఇలా..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రతీ రోజు కొనుగోలుదారులు 5000 వరకు వివిధ వస్తువులకు సంబంధించిన ఆర్డర్లు పెడుతున్నారు. సగటున రూ.40 నుంచి రూ. 45 లక్షల వరకు కొనుగోళ్ల లావాదేవీలు జరుగుతున్నాయి.

పండుగ వేళల్లో అయితే ఈ కొనుగోళ్ల మొత్తం రూ.60 నుంచి రూ.70 లక్షల వరకు చేరు తోంది. ఉమ్మడి జిల్లాలో ఆన్‌లైన్ కొరియర్ సంస్థలు 22 వరకు ఉన్నాయి. ఈ-కామర్స్ ద్వారా సుమారు 5000 మంది నిరుద్యోగులు ఉపాధి పొందుతున్నట్టు అంచనా.

సవాళ్లు

గ్రామీణ ఈ-కామర్స్‌కు సంబంధించి కొన్ని ఇబ్బందులు కూడా ఎదురవుతున్నాయి. మారుమూల గ్రామాలకు ఇంటర్నెట్ కనెక్టివిటీ లేకపోవడం వల్ల ఆ ప్రాంత ప్రజలు ఈ-కామర్స్‌లో తమకు ఇష్టమైన వస్తువులను ఆర్డర్ పెట్టుకోలేకపోతున్నారు. ఒక వేళ పెట్టుకున్నా ఏజెన్సీలు ఆ ప్రాంతాలకు డెలివరీలను బుక్ చేసుకోవడం లేదు. డెలివరీ బాయ్స్ కూడా అంతదూరం వెళ్లడానికి ఇష్టపడడం లేదు. గ్రామీ ణ ప్రాంతాల్లో ఉత్పత్తులను సకాలంలో డెలివరీ చేయడం కొన్నిసార్లు కష్టమవుతోంది. అందరికీ స్మార్ట్‌ఫోన్లు లేకపోవ డం, ఆన్‌లైన్ షాపింగ్ గురించి తెలియకపోవడం వల్ల ఈ-వ్యాపారం కొన్ని ప్రాంతాల్లోని గ్రామీణు లకు చేరువ కాలేకపోతున్నది.

అమ్మకమవుతున్న వస్తువులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఈ-కామర్స్ ద్వారా పట్టణాల్లో ఎక్కువగా స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు, స్మార్ట్‌వాచ్‌లు, దుస్తులు, చెప్పులు, బ్యాగులు, ఆభరణాలు, ప్రధానంగా చీరెలు, ఫ్యాషన్ డ్రెస్ మెటీరియల్, ఆహార పదార్థాలు, రోజువారి ఉపయోగించే వస్తువులు, కాస్మోటిక్స్, హెయిర్ కేర్ ఉత్పత్తులు అమ్మకమవుతున్నాయి. ఈ-కామర్స్‌లో తమకు కావాల్సిన వస్తువులకు ఆర్డర్ చేయ డంలో ఇటీవల కాలంలో పల్లె ప్రజ లు కూడా పట్టణ ప్రాంత ప్రజల తో పోటీ పడుతున్నారు.

ప్రధానంగా వ్యవసాయానికి సంబంధించిన ఉపకరణాలు, విత్తనాలు, ఎరువులు సైతం అమ్ముడవుతున్నాయి. ఇటీవల కాలంలో గ్రామీణ ప్రాంతాల నుంచి ఎలక్ట్రానిక్ వస్తువుల ఆర్డర్లు కూడా పెరిగాయి. దుస్తులు, చెప్పులు, బ్యాగుల వంటి వస్తువుల కోసం కూడా ఆర్డర్లు పెడుతున్నారు. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ వంటి ఈ-కామర్స్ వెబ్‌సైట్‌లలో వరంగల్ ఉమ్మడి జిల్లాకు సంబంధించిన బెస్ట్‌సెల్లర్స్ జాబితాలను పరిశీలించినప్పుడు ఎక్కువగా ఈ వస్తువులే కనిపిస్తున్నాయి. స్థానికంగా తయారయ్యే ఉత్పత్తులకు ఆన్‌లైన్‌లో మంచి డిమాండ్ ఉంది.

పాఠశాలలకు చేయూతనివ్వాలి

- విద్యార్థులు సన్మార్గంలో నడవాలి : వరంగల్ ఎంపీ కడియం కావ్య
- ఘనంగా కూనూరు స్కూల్ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

జఫర్‌గడ్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు చేయూతనందించాలని వరంగల్ ఎంపీ కడియం కావ్య కోరారు. కూనూరు జడ్పీ హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ చెంది 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు రెండు రోజుల గోల్డెన్ జూబ్లీ వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేడుకలకు కావ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలలు, విద్యార్థుల, సమాజ ప్రగతికి పూర్వ విద్యార్థులు సహాయ సహకారాలు అందివ్వాలన్నారు. సోషల్ మీడియా ప్రభావంతో విద్యార్థులు తప్పుదోవ పడకుండా, చదువులో రాణిస్తూ ఉన్నత స్థితికి చేరాలన్నారు. 50 ఏళ్ల అయా టెన్త్ బ్యాచ్ విద్యార్థులు సంఘటితమై మహా సమ్మేళనం పేరుతో గోల్డెన్ జూబ్లీ వేడుకలను నిర్వహించడం అభినందనీయమన్నారు.



అబ్దుల్ కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ కావ్య, అరూరి రమేష్

విద్యార్థి దశ ఎంతో ప్రాధాన్యం

వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే, పాఠశాల పూర్వ విద్యార్థి అరూరి రమేష్ మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో ప్రధానమైందన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల బోధనలతోనే తాను ఎమ్మెల్యే స్థాయికి ఎదగడం జరిగిందన్నారు. నాటి బాల్యమిత్రులను, గురువులను ఒక్క చోట కలుసుకునేలా. నాటి ఆపాత మధుర స్మృతులను నెమరువేసుకుంటూ ఆప్యాయంగా మాట్లాడుకునేందుకు పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు చక్కటి వేదికలుగా ఉపయోగపడతాయన్నారు.

బాలికల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సమావేశానికి ముందు పాఠశాల ఆవరణలో భారత మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం విగ్రహానికి ఎంపీ కావ్య మాజీ ఎమ్మెల్యే రమేశ్, కమిటీ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సావనీర్‌ను ఆవిష్కరించారు.

నిర్వహణ కమిటీ కన్వీనర్ నాగమళ్ల అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ లావణ్య శిరీష్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ కరుణాకర్‌రావు, ఎంఈవో రఘునందన్, కమిటీ ప్రతినిధులు గంగిడి వెంకటేశ్వర్‌రెడ్డి, కాటం లక్ష్మారెడ్డి, ఆకుల కుమారస్వామి, పిట్ట రాజు. పల్లెపాటి జయపాల్‌రెడ్డి, అమరోజు శ్రీనివాస్, బెల్లి సరిత, శోభారాణి, ప్రమోద్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కావ్య, అరూరి రమేష్

శీతాకాల వ్యాధులపై

అవగాహన కల్పించాలి

• వైద్య సిబ్బందితో డీఎంహెచ్‌వో

వాజేడు, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): చలికాలంలో వచ్చే వ్యాధులపై ప్రజలకు వైద్య ఆరోగ్య సిబ్బంది అవగాహన కల్పించాలని డీఎంహెచ్‌వో గోపాలరావు అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీని ఆయన శనివారం సందర్శించారు. ఆస్పత్రిలోని రికార్డులు, డ్రగ్‌రూం, స్టోర్ రూం, ప్రసవాల గదిని పరిశీలించారు. నిల్వ ఉన్న మందుల వివరాలు, అత్యవసర మందుల వినియోగం గురించి వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆశా కార్యకర్తలతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన అన్ని కార్యక్రమాలనూ వందశాతం పూర్తి చేయాలన్నారు. వైద్యులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయన వెంట వైద్యాధికారులు మోహన్‌సింగ్, అల్లి మధుకర్, కొమురం మహేందర్, జ్ఞానస, యోషిత, హెచ్‌ఎస్‌లు కోటిరెడ్డి, వెంకటరమణ తదితరులు ఉన్నారు.

పీహెచ్‌సీల పరిశీలన

తాడ్వాయి (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డీఎంహెచ్‌వో గోపాల్‌రావు సందర్శించారు. ఈసందర్భంగా ఆయన రోగులకు అందు తున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ చిరంజీవి, డీపీఎంవో సంజీవరావు, స్టాఫ్‌నర్సు ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, సిబ్బంది ఉన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం పల్లె దవాఖాన, ఆయుష్మాన్ ఆరోగ్యం మందిరంలో శనివారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల రావు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పలు అంశాలపై డాక్టర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ల హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు సూచనలు చేశారు. డాక్టర్ సుమలత, డాక్టర్ మమత, చుంచుపల్లి ఆరోగ్య కేంద్రం డాక్టర్ యమునా తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు 'టాస్క్'

- ములుగులో స్కిల్ నాలెడ్జి సెంటర్ ఏర్పాటుకు సన్నాహాలు
- నెలాఖరులో మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభం
- 23 వరకు దరఖాస్తుల ఆహ్వానం
- పది రోజుల కాలపరిమితితో నైపుణ్య శిక్షణ
- తొమ్మిది సంస్థలతో ఒప్పందం



ములుగులో ప్రారంభానికి సిద్ధమైన టాస్క్ సెంటర్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్ (తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జి) సెంటర్ జిల్లా కేంద్రంలో సిద్ధమైంది. ములుగు జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్ పక్కనే ఉన్న భవనంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ఈనెలాఖరులోగా రాష్ట్ర మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించేలా అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

నైపుణ్యాలకు మెరుగు..

యువత ఆసక్తి, నైపుణ్యాలను గుర్తించి వాటికి మెరుగుపెట్టడం ద్వారా ఎంచుకున్న రంగంలో ఉత్తమంగా రాణించేలా ఈ టాస్క్ సెంటర్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించేలా శిక్షణ ఉంటుంది. పది రోజుల కాల పరిమితితో రెండు సెషన్లలో శిక్షణా తరగతులు కొనసాగనున్నాయి. ఇంగ్లిష్ భాష సామర్థ్యాన్ని పెంచడం, ఇంటర్వ్యూలను ఎదుర్కొనేలా మెలకువలను నేర్పడం, టీమ్ లీడర్‌గా రాణించే సత్తాను కల్పించడం ప్రధాన అంశాలుగా ఈ కేంద్రాలలో మెంటార్లుగా పనిచేయనున్నారు.

రెండు సెషన్లు.. 16 అంశాలు

శిక్షణ రెండు సెషన్లుగా నిర్వహించనున్నారు. ఇందులో 16 అంశాలను ప్రధానమైనవిగా గుర్తించారు. మొదటి సెషన్‌లో ఉద్యోగ నైపుణ్యాల పరిచయం, కమ్యూనికేషన్, ప్రజెంటేషన్, గణితం, తర్క, ప్రోగ్రామింగ్, డేటాబేస్, సమయ నిర్వహణ/ ఉత్పాదకత, మాక్ ఇంటర్వ్యూలు, రెండో సెషన్‌లో రెజ్యూమ్ నిర్మాణం/ఇంటర్వ్యూ తయారీ, కెరీర్ డెవలప్‌మెంట్, ఉద్యోగ అన్వేషణ వ్యూహాలు, వ్యక్తిగత బ్రాండింగ్/ఆన్‌లైన్ ఉనికి, సాఫ్ట్ నైపుణ్యాల్లపై శిక్షణ ఇస్తారు.

తొమ్మిది కంపెనీల్లో ఉద్యోగాలు

శిక్షణ పూర్తి చేసుకున్నవారి నైపుణ్యాల ఆధారంగా వెంటనే ఉద్యోగాలు కల్పించేందుకు ప్రభుత్వం తొమ్మిది కంపెనీలతో ఒప్పందం చేసుకుంది. ఐటీ, డిజిటల్, సోలార్, టెలికామ్, ఆటోమొబైల్, ఫార్మా, కన్సల్టింగ్, బ్యాంకింగ్, రిటైల్ సేల్స్ రంగాలకు చెందిన జెన్‌పాక్ట్, టాటా స్ట్రీవ్, జస్ట్ డయల్, మెడ్‌ప్లస్, అపోలో ఫార్మసీ, టీమ్‌లీజ్, వరుణ్ మోటార్స్, ముథూట్ ఫైనాన్స్, రిలయన్స్ జియో కంపెనీలలో ఉద్యోగాలు కల్పించనున్నారు.

నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి

టీఎస్.దివాకర, ములుగు కలెక్టర్



ములుగు జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు నైపుణ్య శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి. ఈ టాస్క్ కేంద్రంలో ప్రవేశం కోసం 18 ఏళ్ల నుంచి 35ఏళ్ల లోపు ఉన్నవారు అర్హులు. డిగ్రీ, పీజీ, డిప్లొమా, ఎంబీఏ, ఎంసీఏ, బీటెక్ వంటి కోర్సులు చదివిన వారు విద్యార్హత ధ్రువపత్రాలతో ఈనెల 23వ తేదీ సాయంత్రం 5గంటల లోపు జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. వివరాల కోసం 8886220324, 9440348961 నెంబర్‌లను సంప్రదించాలని సూచించారు.

రామప్పలో పర్యాటకుల సందడి



రామప్పలో విదేశీయులు

వెంకటాపూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో పర్యాటకుల సందడి నెలకొంది. బెల్జియం దేశానికి చెందిన దంపతులు డాక్టర్ స్టీఫెన్-స్కార్లెట్‌తోపాటు తెలంగాణ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన పాఠశాలల విద్యార్థులు సందర్శించారు. రామలింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ శిల్పకళా సంపదను వీక్షించారు.అనంతరం సరస్సు వద్దకు చేరుకుని ప్రకృతి అందాలను ఆస్వాదించారు.

'ఎన్‌హెచ్ విస్తరణ పనుల్లో పేదలకు అన్యాయం'

వాజేడు, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో చేపడుతున్న జాతీయ రహదారి విస్తరణ పనుల్లో పేదలకు అన్యాయం జరుగుతోందని సీపీఎం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ తహసీల్దార్ రాహుల్ చంద్ర వర్మకు వినతిపత్రం అందించారు. నాలుగు లేన్ల పనుల్లో ఇళ్లు, చిరువ్యాపారులకు నష్టం వాటిల్లిందని, వారికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రాజకీయ పలుకుబడి ఉన్న వ్యక్తుల ఇళ్లు తొలగించడకుండా పేదలకు నిలువనీడ లేకుండా చేస్తున్నారని ఆరపించారు వినతిపత్రం ఇచ్చిన వారిలో దామోదర్, బచ్చల కృష్ణబాబు, కారం నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

టీఎస్‌జీవీబీగా ఏపీజీవీబీ

వెంకటాపూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్‌బ్యాంక్ (ఏపీజీవీబీ) ఇక నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్‌బ్యాంక్ (టీఎస్‌జీవీబీ)గా మారనున్నట్లు వెంకటాపూర్ బ్రాంచ్ మేనేజర్ సుమన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో వేర్వేరుపేర్లతో ఉన్న గ్రామీణ బ్యాంకులు సంబంధిత రాష్ట్రం పేరుతో సేవలందించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో 2025 జనవరి 1 నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్‌బ్యాంక్ పేరుతో సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈమార్పు కారణంగా ఈనెల 28 నుంచి 31 వరకు నాలుగురోజులపాటు అన్నిరకాల బ్యాంకింగ్, ఆన్‌లైన్ సేవలు నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

'ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్' సభ్యుడికి సన్మానం

కన్నాయిగూడెం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నికైన మండలంలోని చింతగూడెం గ్రామానికి చెందిన సునార్కని రాంబాబును శనివారం పెద్దపల్లి ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, నేతకాని కుల సంఘం జాతీయ అధ్యక్షుడు గొమాసా శ్రీనివాస్ సన్మానించారు. నేతకాని కులం నుంచి ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కమిటీలో స్థానం దక్కడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏసూరి రాజమళ్లు, జిల్లా అధ్యక్షుడు జాడి రాంబాబు, ప్రొఫెసర్ జాడి ముసలయ్య, స్టీరింగ్ కమిటీ చైర్మెన్ బండారి కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ మహాసభలను జయప్రదం చేయాలి

ఏటూరునాగారం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు వట్టం జనార్ధన్ కోరారు. మండల కేంద్రంలోని తుడుందెబ్బ కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 22, 23 తేదీల్లో 9వ రాష్ట్ర మహాసభలను ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహిస్తునట్లు తెలిపారు. దీనిని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి చందా మహేష్, జాతీయ కన్వీనర్ పొడెం రత్నం, తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కబ్బాక శ్రావణ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఎట్టి రాజబాబు, జిల్లా కార్యదర్శి కాపుల సమ్మయ్య, ఏటూరునాగారం మండల అధ్యక్షుడు సోలం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలబాలికలు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి

వెంకటాపూర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలబాలికలు క్రమశిక్షణతో ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని ఎదగాలని జిల్లా మహిళా సాధికరత మిషన్ కోఆర్డినేటర్ పి.రమాదేవి అన్నారు. శనివారం మండలంలోని నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో బాలలు, మహిళా హక్కుల పరిరక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమం జరగగా రమాదేవి పాల్గొని బాలల హక్కుల పరిరక్షణ, చట్టాలు, చైల్డ్‌హెల్ప్‌లైన్- 1098, సైబర్‌క్రైం, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మొహమ్మద్ సర్వర్ అహ్మద్, ఉపాధ్యాయులు సుమన్, అంగన్‌వాడీ టీచర్లు సరోజన, సబిత, ఆశా వర్కర్ రాజ్యలక్ష్మి, జెండర్ స్పెషలిస్ట్ ఎస్.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

తాడ్వాయి, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి దుగ్గి చిరంజీవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని కాటాపూర్‌లో ప్రభుత్వం పంపిణీ చేసిన ఇంటి స్థలాలను ఆయన శనివారం పరిశీలించారు. 2023లో పేదలకు కేటాయించిన ఇంటి స్థలాలను ప్రభుత్వం ఇప్పటివరకు పంచి ఇవ్వకుండా తాత్సారం చేస్తుందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పేదలకు ఇళ్ల స్థలాలను పంచి ఇవ్వాలని, లేనట్లయితే గుడిసెలు వేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిట్టినేని శ్రీను, ఎర్రోజు సత్యనారాయణ, నర్సింగరావు, బాబూరావు, రేణుక, మడిపెల్లి భాగ్య, ఇల్లందుల లక్ష్మి పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఏటూరునాగారం, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యా శాఖలో కీలక పాత్ర పోషిస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) ములుగు జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లె నాగరాజు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శనివారం టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు బి. రాజు అధ్యక్షతన శనివారం జరిగిన కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం అన్యాయమని విమర్శించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి భూక్యా సారంగపాణి, మండల నాయకులు వై. సతీష్, పాఠశాల ఉపాధ్యాయులు కొర్ర రాజన్న, సాంబయ్య, సుమన్, లక్ష్మణ్, రమణ, ధర్మరావు తదితరులు పాల్గొన్నారు.

దాన్యాన్ని కొనుగోలు చేయాలి : బీఆర్ఎస్

ములుగు కలెక్టరేట్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): రైతులు కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పోరిక గోవింద్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ములుగు మండలంలోని కన్నాయిగూడెం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈసందర్భంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు రైతులు ధాన్యాన్ని తీసుకువచ్చి రోజులు గడుస్తున్నా అధికారులు కొనుగోలు చేయడంలేదని అన్నారు. వాతావరణంలో ఏర్పడే మార్పులతో రైతులు సతమతమవుతున్నారని, ఎలాంటి ఆలస్యం చేయకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు దేవరనేని స్వామిరావు, అమర్‌సింగ్, మేకల కుమార్, రఘు, అంగోత్ రవి, రైతులు సరిత, అజ్మీరా లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

ఇసుక క్వారీ కేటాయింపుపై గ్రామసభ

మంగపేట: డిసెంబరు: 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడగూడెం గ్రామ పంచాయతీ శివారు పాలాయిగూడెం ఎస్టీ కాలనీలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుక్రవారం సాయంత్రం గ్రామ సభ జరిగింది. రెవెన్యూ, పంచాయతి అధికారులు సంయుక్తంగా నిర్వహించారు. తెలంగాణ ఖనిజాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ప్రతిపాదిత వాడగూడెం- 3వ, ఇసుక క్వారీ గ్రామసభ జరిగింది. గ్రామంలో 136 మంది ఓటర్లు ఉండగా 250 మంది ప్రజలు ఈ గ్రామసభకు హాజరయ్యారు. అధికారులు ఆ గ్రామ ప్రజల అభిప్రాయాలను గ్రామసభలో అధికారులు సేకరించారు. అడిషనల్ కలెక్టర్ మహేందర్ జీ, వరంగల్ ఉమ్మడి జిల్లాల రాష్ట్ర కాలుష్య నియంత్రణాధికారి సునీత, టీఎస్ఎండీసీ ప్రాజెక్టు ఆఫీసర్(పీవో) శ్రీకాంత్‌రెడ్డి, ఎన్విరాల్మెంట్ ప్రతినిధి కె. వసంత్‌కుమార్ హాజరై గోదావరిలో ఇసుక క్వారీ కేటాయింపుపై ప్రజాభిప్రాయం తీసుకున్నారు. అనంతరం ఇసుక క్వారీని కేటాయిస్తూ గ్రామ సభ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో పర్యావరణవేత్త సునందరెడ్డి, తహసీల్దార్ రవీందర్, ఎంపీవో కిషోర్, ఎంపీడీవో కార్యలయం సూపరిండెండింట్ సుదర్శన్, ఎస్సై నూరి పాల్గొన్నారు.

అక్రమ అరెస్టు హేయనీయం : డీఎస్పీ

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీలకు కూడు, గుడ్డ, నీరు, విద్య, వైద్యం అందించాలని డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్యబద్ధం ఆమరణ దీక్షలు చేస్తుంటే పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం హేయనీయమని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరి రవీందర్ విమర్శించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దళిత గిరిజనులకు ప్రభుత్వం అన్ని రకాల చేయూతనివ్వాలని డిమాండ్ చేశారు. దీనికోసం ఆమరణ దీక్షలు చేస్తే భగ్నం చేయడం సబబు కాదన్నారు. ప్రభుత్వం పేద ప్రజలను కుట్రపూరితంగా అణచి వేస్తోందని మండిపడ్డారు. విలేకరుల సమావేశంలో పార్టీ ప్రధాన కార్యదర్శి కండె రవి, నాయకులు శ్రీనివాస్, స్వామినాథన్, ధశరథ్, అశోక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జ్యుడీషియల్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా జ్యుడీషియల్ ఉద్యోగుల నూతన కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఒల్లాల సదానందం, ప్రధాన కార్యదర్శిగా పాలకర్తి సాయి చరణ్, కోశాధికారిగా కె. స్వప్న, గౌరవ అధ్యక్షురాలిగాగా అనిత వాణితోపాటు కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. జిల్లా జడ్జి నారాయణబాబును నూతన కార్యవర్గం మర్యాద పూర్వకంగా కలవగా ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి జయరాంరెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి రాంచంద్రారావు పాల్గొన్నారు.

ఎస్సైపై ఎస్పీకి ఫిర్యాదు

రేగొండ, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : తనను అకారణంగా ఎస్సై కొట్టారంటూ ఓ వ్యక్తి ఎస్పీ కార్యాలయంలో శనివారం ఫిర్యాదు చేశాడు. తన మామ పంచగిరి వీరస్వామితో భూవివాదంలో తనను ఎస్సై పోలీస్‌స్టేషన్‌కు పిలిచి కొట్టారని గాజె వీరస్వామి అనే వ్యక్తి మీడియాకు శనివారం ఒక ప్రకటనను విడుదల చేశాడు. ఆయనపై ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశానని తెలిపాడు. దీనిపై ఎస్సైను వివరణ కోరగా వీరస్వామిని తాము కొట్టలేదని స్పష్టం చేశారు. ఈ నెల 17న ఓ భూమి విషయంలో పలువురితో గొడవ పడుతుండగా తమకు ఫిర్యాదు అందిందన్నారు. భూ సమస్య ఉంటే తహసీల్దార్ కార్యాలయంలో పరిష్కరించుకోవాలంటూ కౌన్సెలింగ్ చేసి పంపామని వివరించారు.

ఉపాధ్యాయులు సెమినార్ పత్రాలు అందజేయాలి : డీఈవో

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌కు సంబంధించిన పత్రాలు సకాలంలో అందజేయాలని డీఈవో ముద్దమల్ల రాజేందర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. తెలంగాణ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక శిక్షణ, పరిశోధన సంస్థ (ఎస్‌సీఈఆర్‌టీ) ఆధ్వర్యంలో 'మన ప్రపంచంలో సైన్స్' అనే అంశంపై సెమినార్‌ను ఉపాధ్యాయులకు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో జనవరి 20న పత్రాలు సమర్పించాలని కోరారు. ఫిబ్రవరి 28న జాతీయ సైన్స్ దినోత్సవం జరుగుతుందని పేర్కొన్నారు.

రేపు కాళేశ్వరాలయ హుండీ లెక్కింపు

మహదేవపూర్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : ఈ నెల 23న కాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ హుండీ లెక్కింపు జరుగుతుందని నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు హుండీలను తెరిచి డబ్బుల లెక్కింపు కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

అపరచితులతో అప్రమత్తంగా ఉండాలి

మహదేవపూర్ రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి) : అపరిచితుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ అన్నారు. మండల పరిధిలోని బ్రాహ్మణపల్లిలో శనివారం కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటినీ పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. పత్రాలు, నెంబరు ప్లేట్లు లేని వాహనాలను పరిశీలించి జరిమానా విధించారు. అనుమానితులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ఈత నిఖీల్లో హెడ్‌కానిస్టేబుల్ పున్నం, పీసీలు కిషన్, చంద్రమోహన్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

సీఐ, ఎస్సైలను కలిసిన యూనియన్ నేతలు

భూపాలపల్లి కృష్ణకాలనీ, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్, ఎస్సైలు సుధాకర్, రమేష్‌ను సింగరేణి కోల్ మైన్స్, అవుట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ భూపాలపల్లి ఏరియా ఇన్‌చార్జి కోల నాగేంద్ర బాబు ఇతర సభ్యులు శనివారం మర్యాదపూర్వంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

పశువులకు రాయితీపై కృత్రిమ గర్భధారణ

కాటారం, డిసెంబరు21 (ఆంధ్రజ్యోతి) :ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ద్వారా రాయితీపై పశువుల్లో కృత్రిమ గర్భధారణ కార్యక్రమాలు చేపడుతున్నట్టు పశువైద్యాధికారి డాక్టర్ ధీరజ్ తెలిపారు. మండలంలోని మేడిపల్లి జీపీ పరిధిలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉచిత పశువైద్యశిబిరం నిర్వహించారు. పశువులకు చికిత్సలు చేసి మందులు అందించారు. ఆవులు, గేదెల్లో కృత్రిమ గర్భధారణ చేయిస్తే ఆడదూడలు జన్మించి పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందన్నారు. కృత్రిమ గర్భధారణ కిట్ విలువ రూ.675 ఉండగా ప్రభుత్వ రాయితీపై రూ.250కే అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పశుగణాభివృద్ధి సంస్థ సూపర్‌వైజర్ రాఘవ, వెటర్నరీ అసిస్టెంట్ రాజశేఖర్, గోపాలమిత్రలు పాల్గొన్నారు.

ఉన్న భవనాన్ని కూల్చి ..

ఏటూరునాగారం రూరల్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): నూతన భవనాన్ని నిర్మించి తలపెట్టి పాత భవనాన్ని కూల్చి అంగన్‌వాడీలోని బాలింతలు, గర్భిణులు పిల్లలను రోడ్డున పడేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. కోయగుడ ఎల్లాపూర్(రాంనగర్)లో ఉన్న అంగన్‌వాడీ సెంటర్-2కు ఉపాధిహామీ పథకం నిధుల ద్వారా నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో కొత్త నిర్మించేందుకు మూడు నెలల క్రితం పాత భవనాన్ని తొలగించారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని సీడీపీవోకు పంచాయతీ రాజ్ శాఖ డీఈ, ఏఈలు హామీ ఇచ్చారు. అప్పటి వరకు పాఠశాల ఆవరణలోని ఓ గదిలో అంగన్‌వాడీ కేంద్రాన్ని నడిపించాలని కేటాయించారు. కానీ, కొన్ని కారణాల వల్ల భవన నిర్మాణాన్ని నిలిపివేయాలంటూ ఆదేశాలు వచ్చాయి. దీంతో నిర్మాణం ఆగిపోయింది. ఈ నేపథ్యంలో పాఠశాల ఆవరణలో ప్రస్తుతం నడుస్తున్న గది కూడా ఇబ్బందిగా ఉండటంతో ఆ అంగన్‌వాడీ టీచర్ ఆరు బయటనే అంగన్‌వాడీకి వచ్చే గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అవస్థలు పడుతూ పౌష్టికాహారం అందిస్తున్నారు. పాఠశాల వరండాలోనే చాలా రోజులుగా కేంద్రం నిర్వహించే పనులను చేపట్టలేకపోతున్నామని, నిలిపివేసిన నూతన భవనం నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్‌కు అంగన్‌వాడీ టీచర్ విజ్ఞప్తి చేస్తున్నారు.



పాఠశాల ఆవరణలో పిల్లలకు బోధిస్తున్న అంగన్‌వాడీ

కాకతి కదనభేరి పోస్టర్ ఆవిష్కరణ

గణపురం, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ఏకీకృత పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22న నిర్వహించనున్న కాకతీ కదన భేరి కార్యక్రమానికి చెందిన పోస్టర్‌ను సీపీఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎండీ దిల్షాద్ మండల కేంద్రంలో శనివారం ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో ఉద్యోగులు భాస్కర్, దేవేందర్, వెంకటేశ్, రంగరాజు, రాజు, రఘు, రంజీత్, అశోక్, స్వప్న, సుమతి తదితరులు పాల్గొన్నారు.

అప్‌గ్రేడ్‌పై ఆశలు

(5వ పేజీ తరువాయి)

రాజేష్ అందుబాటులో ఉంటున్నారు. వీరితో పాటు మరో 42మంది వైద్యులు సేవలు అందిసున్నారు.

రోజూ సగటున 500 ఓపీలు

జీజీహెచ్ సేవలు రోజురోజుకూ విస్తృతమవుతున్నాయి. పీహెచ్‌సీ స్థాయి నుంచి జీజీహెచ్‌గా అప్‌గ్రేడ్ అయిన తర్వాత దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రతి రోజూ ఇక్కడ 400-500 మందికి ఓపీ సేవలు అందుతున్నాయి. దీంతో పాటు మరిన్ని సేవలు ప్రజలకు అందుతున్నాయి. ఆస్పత్రిలో జరిగే డెలవరీల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రతి నెల 200 వరకు డెలవరీలు ఆస్పత్రిలో జరుగుతున్నాయి. నవంబరులో 200 పైచిలుకు డెలవరీలు ఆస్పత్రిలో జరిగాయి. ఇక్కడి డెలవరీల్లో 60 శాతానికి పైగా సాధారణ కన్పులే ఉన్నాయి. ఆస్పత్రి సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ సాధారణ డెలవరీలపై సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడంతో సత్ఫలితాలు కనిపిస్తున్నాయి. జీజీహెచ్‌లో జరిగే సర్జరీల సంఖ్య కూడా అధికంగానే ఉంది. వెంటిలేటర్ అవసరం లేని సర్జరీలు ఆస్పత్రిలో ఎక్కువగానే జరుగుతున్నాయి. ప్రతి నెల 200-250కి పైగా సర్జరీలు జీజీహెచ్‌లో జరుగుతున్నాయి. డెలవరీలు, సర్జరీలతో పాటు హైరిస్క్ కేసులను కూడా జీజీహెచ్‌లో పరిష్కరిస్తున్నారు.

మెరుగైన సేవలు అందిస్తున్నాం

- రాహుల్‌శర్మ, భూపాలపల్లి కలెక్టర్



జీజీహెచ్‌లో ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. ఆస్పత్రి మెడికల్ కాలేజీకి అనుసంధానంగా ఉండటంతో ఎంతో అనుభవం ఉన్న వైద్యులు విధులు నిర్వర్తిస్తున్నారు. జనవరి చివరి వారంలో లేదా ఫిబ్రవరి మొదటివారంలో ఆస్పత్రిలో సిటీ స్కానింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఆస్పత్రిలో శానిటేషన్ పనులను మెరుగుపర్చుకునేందుకు త్వరలోనే సిబ్బందిని నియమిస్తాం.

సిబ్బంది సమ్మెతో ఇబ్బంది

మల్హర్, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 13 రోజులుగా సమ్మె చేస్తుండటంతో మండల విద్యాశాఖలో మధ్యాహ్నం భోజనం బిల్లులు, ఆన్‌లైన్ పనులు, యూడైస్ పనులు నిలిచి పోయాయి. దీంతో మధ్యాహ్న భోజన నిర్వాహకులతో పాటు పలువురు ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు సమ్మెకు వెళ్లడంతో కొయ్యూర్‌లోని ఎమ్మార్సీ భవనానికి తాళం వేసి ఉంటోంది. సమ్మెలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ సవేందర్, కంప్యూటర్ ఆపరేటర్ సంపత్, సీర్పీలు సమ్మయ్య, సమత, పుష్పలత, ఐఆర్పీలు జనార్దన్, సమ్మిరెడ్డి, మెసేంజర్ షాయక్ తదితరులు పాల్గొంటున్నారు.

కేంద్ర మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

చిట్యాల, డిసెంబరు 21 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను బర్తరఫ్ చేయాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ పుల్ల మల్లయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఏఐఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శనివారం నిరసన తెలిపారు. ఈకార్యక్రమంలో సౌత్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేష్, ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కోశాధికారి శీలపాక నాగరాజు, కొల్లూరి అశోక్, మాసు రమేష్, నేరెళ్ల సమ్మయ్య, చందర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



కాటారంలో ధ్యానం చేస్తున్న విద్యార్థినులు, టీచర్లు

భూపాలపల్లిటౌన్, డిసెంబరు 21(ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని హార్ట్‌ఫుల్‌నెస్ జిల్లా కో ఆర్డినేటర్ రవీందర్ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ ధ్యాన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులకు ధ్యాన శిక్షణ తరగతులు జరిగాయి. ధ్యానం ఎలా చేయాలి.. ఎందుకు చేయాలి.. దాని వల్ల కలిగే ప్రయజనాలు ఏమిటి అనే అంశాలపై రవీందర్ అవగాహన కల్పించారు. అనంతరం ప్రిసిప్టర్ మాధవి అధ్యాపకులతో ధ్యానం చేయించారు. ఈ కార్యక్రమంలో ప్రిసిప్టర్ లక్ష్మణ్, సాధకులు మాధవరెడ్డి, మంతెన సమ్మయ్య, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• ఏటూరునాగారం (ఆంధ్రజ్యోతి): ధ్యానం వల్ల అనేక ప్రయోజనాలున్నాయని ఏటూరునాగారం సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై ఎస్.కె. తాజుద్దీన్ అన్నారు. ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని స్థానిక కొయురం భీం స్టేడియంలో యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో ధ్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా సీఐ, ఎస్సై హాజరయ్యారు. డాక్టర్ వరప్రసాదరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిటమట రఘు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

• కాటారం (ఆంధ్రజ్యోతి):మండలంలో ప్రపంచ ధ్యాన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిరిజన సంక్షేమ బాలికల గురుకుల విద్యాలయంతో పాటు పలు గురుకులాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది ధ్యానం చేశారు. ఈ సందర్భంగా ఎస్టీ బాలికల గురుకులం ప్రిన్సిపాల్ నాగలక్ష్మి మాట్లాడుతూ ధ్యానంతో మనిషిలో ఆందోళనలు తగ్గడంతో పాటు ఆలోచనశక్తి, ఏకాగ్రతలు పెరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో గురుకులం పీడీ గౌతమి, పీఈటీ శ్రీవిద్య, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

• గోవిందరావుపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్వాయి గ్రామంలో గల 5వ బెటాలియన్‌లో ప్రపంచ ధ్యాన దినోత్సవం సందర్భంగా అధికారులు, సిబ్బంది ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఇన్‌చార్జి కమాండెంట్ కె.సుబ్రహ్మణం పాల్గొని మానసిక ప్రశాంతత, ఆత్మనిమగ్నత, ఆధ్యాత్మిక ఉనికి కోసం ధ్యానం ప్రాధాన్యతను వివరించారు. ధ్యానం మానసిక శాంతి కోసం కాకుండా శారీరక ఆరోగ్యానికి కూడా ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ అనిల్‌కుమార్, రిజర్వు ఇన్‌స్పెక్టర్లు కార్తీక్, శ్రీనివాసులు, అన్నయ్య, ఇతర బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.